## క్లుప్తంగా

### నిత్యవసర సామగ్రి వితరణ



మక్తల్: పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భీమా అధ్యక్షుడు సత్య ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం వర్షానికి ఇళ్లు కోల్పోయిన బాధితులకు, పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి టార్పాలిన్లు, నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో వంట పాత్రలు, దుప్పట్లు తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కొండయ్య, వీరేషం, డాక్టర్ శ్రీరామ్, అనుగొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయానికి రూ.లక్ష విరాళం



మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీ దేవి ఆలయం చుట్టూ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు బుధవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.రాజ్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దేవాలయం చుట్టూ గ్రిల్స్ లేకపోవడంతో హుండీ చోరీకి గురైన విషయాన్ని రాజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన మొదట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనంతరం గ్రిల్స్ కోసం విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు దూబాయ్ రాములు, హరిప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్రామారెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజేష్, రామస్వామి, కృష్ణయ్య, హరీష్, సురేష్, మల్లేష్, రాములు, రఘు, శ్రీను, రాఘవేందర్‌డ్, సత్యారెడ్డిలు పాల్గొన్నారు.

### గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

మక్తల్: మక్తల్‌లో శనివారం జరిగే గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మక్తల్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, కమిషనర్ నర్సింములు, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డికు వినతిపత్రాలు అందజేశారు. తాగునీటి వసతి, విద్యుత్ లైట్లు, క్రేన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే గణేశ్ ఊరేగింపు సమయంలో వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని కోరారు.

### సమస్యలు పరిష్కరించండి

దామరగిద్ద: మండల కేంద్రంలోని 5వ వార్డు యాదవ గేరిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ సాయిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగు కాల్వలు, వీధి రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కాల్వలు లేపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారనినారు. సీపీఎం గ్రామ కార్యదర్శి కన్నప్ప, మహేష్, ఉషేనప్ప, చంద్రశేఖర్, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

దామరగిద్ద: ఆటో అదుపుతప్పి ముగ్గురికి స్వల్ప గాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని కండెన్‌పల్లికి చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన పలువురు బాపన్‌పల్లిలో పురుడు కార్యక్రమానికి బయలుదేరారు. ఈక్రమంలో బాపన్‌పల్లి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో యంగలి చెన్నప్ప, లక్ష్మమ్మ, చెన్నప్పకు గాయాలు కాగా జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు



మద్దూరు: వానరాల దాడిలో మరో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన దస్తప్ప చౌకధర దుకాణంలో బియ్యం తీసుకోవడానికి వస్తుండగా.. మరో వృద్ధురాలు వెంకటమ్మ కిరాణా షాపుకు వెళ్తున్న క్రమంలో కోతి వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితులకు స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి కోతులను గ్రామం నుంచి దూరంగా తరలించాలని కోరుతున్నారు.

# ప్రహరీలు లేక.. తప్పని అవస్థలు

- పాఠశాలల్లోకి వస్తున్న విషసర్పాలు, జంతువులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కాంపౌండ్ వాల్ లేని బోయిన్ పల్లి పాఠశాల

నారాయణపేట రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు గ్రామానికి చివర్లో ఉండడంతో విద్యార్థులకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. రక్షణ గోడలు లేకపోవడంతో పాఠశాల ఆవరణలో మొక్కలకు, ఇతర సామగ్రికి రక్షణ లేకుండా పోతుంది. అలాగే పశువులు, ఇతర విష కీటకాలు పాఠశాల ప్రాంగణంలోకి వస్తుండడంతో ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందుతున్నారు. తరగతులు నిర్వహణకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. ఇక మధ్యాహ్న భోజన సమయంలో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో వాటిని కట్టడి చేయడానికి ఉపాధ్యాయులు నానా తంటలు పడుతున్నారు. దీనికి తోడు విద్యార్థులు సైతం కడుపునిండా భోజనం చేయలేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల పాఠశాలల ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇవన్నీ జరుగుతున్న ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో గురువులు మిన్నకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

**21 పాఠశాలలకు లేని ప్రహరీలు**

నారాయణపేట ఎంఆర్సీ పరిధిలో ఒక మున్సిపాలిటీతో పాటు 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 45 ప్రాథమిక, 14 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 67 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 35 పాఠశాలకు ప్రహరీలు ఉన్నాయి. వాటిలో ఎక్కువ శాతం పట్టణ ప్రాంతంలో ఉన్నాయి. మరో ఐదు చోట్ల కట్టిన గోడలు కూలిపోయాయి. ఇక 21 పాఠశాలలకు అసలు రక్షణ గోడలు లేవు.

**ఇబ్బందులు ఇలా..**

మండలంలోని కిందితండ పాఠశాలకు వైర్‌తో గోడ ఏర్పాటు చేయడంతో అక్కడ విషపురుగుల నియంత్రణ జరగడం లేదు. అలాగే కొత్తపల్లి తండా, అప్పక్ పల్లి పాఠశాలకు నిర్మించిన గోడలు పాక్షికంగా కూలిపోవడంతో గ్రామ యువత వాటిని ఇతర పనులకు వాడుతున్నారు. జలాల్ పూర్, బసిరెడ్డి పల్లి, లక్ష్మీపూర్, బోయిన్ పల్లి పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం లేక మధ్యాహ్న భోజన సమయంలో పందులు, కుక్కలు ఆవరణలోకి వస్తున్నాయి. గిరిజన గ్రామాలైన పాత తండా, బోయిన్ పల్లి తండా, నల్లగుట్ట తండా, వందరగుట్ట తండా, సుఖరమోని తండా, పిల్లిగుండ్ల తండా, మాల్య తండా, మేక హనుమాన్ తండా, ఉటకుంట తండాల్లో పాఠశాలలు గ్రామ శివారులో ఉండటంతో అక్కడక్కడ మలమూత్ర విసర్జనకు వాడుతున్నారు. మరి కొన్ని చోట్ల విషపురుగులు, జంతువులు పాఠశాల తరగతుల్లోకి వచ్చిన ఘటనలు ఉన్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం..**



మండలంలో ప్రహరీలు లేని పాఠశాలల వివరాలు సేకరించాం. మన ఊరు–మన బడి కింద చాలా పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలు జరిగాయి. ఇబ్బందులు ఉన్న చోట ఆగిపోయాయి. ఏ పాఠశాలలకు ప్రహరీలు అవసరమో గుర్తించి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులను తొలగిస్తాం.
– బాలాజీ, ఎంఈఓ, నారాయణపేట

## పత్తి దిగుమతులపై 50 శాతం పన్ను విధించాలి



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న నర్సింములు

కోస్గి రూరల్: పంటలకు పెట్టుబడిపై 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని అఖిలా భారతీయ ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి కొండ నర్సింములు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో దళారులకు తక్కువకు విక్రయిస్తున్నట్లు వాపోయారు. దేశ రైతాంగానికి అనుకూలమైన విధానాలు రూపొందించి అమలు చేస్తామని ప్రకటించి మూడురోజులు గడవకముందే అమెరికా అధ్యక్షుడి ఆంక్షలకు తలోగ్గి పత్తి దిగుమతులపై ఉన్నా 11 శాతం సుంకాలను రద్దు చేయడం పెట్టుబడిదారి దేశాలకు ఎర్రతివాచి పరచినట్టయిందన్నారు. రైతులు పండించిన పంటల పెట్టుబడిపై 50 శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయిస్తామని వాటి అమలుకు పూనుకోకుండా దేశ రైతాంగాన్ని మోసగిస్తున్నారని మండిపడ్డారు. దిగుమతులపై 50 శాతం పన్ను విధించకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింములు, అనంతయ్య, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

**రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలి**

కృష్ణా: కేంద్రప్రభుత్వం పత్తి దిగుమతులపై విధించిన 11శాతం పన్నులను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ బుధవారం అఖిలభారత ఐక్యరైతుసంఘం (ఏఐయుకేఎస్) నాయకులు తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు ఆనంద్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకున్న విధానాలను ప్రతి రైతు ఖండించాలని కోరారు.

**రైతుల కుటుంబాలను ఆదుకోవాలి**

మక్తల్: ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకొని రైతులకు రూ.25 లక్షల నష్టపరిహారం అందజేయాలని ఏఐయుకేఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ సతీశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు భగవంత్ మాట్లాడుతూ రైతు పండించిన పత్తికి క్వింటాలుకు రూ.10,075 ఎంఎస్‌పీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే అధిక వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐయేకేఎస్ జిల్లా అధ్యక్షుడు భగవంతు, కార్యదర్శి రాజుగోపాల్, అంజప్ప, శ్రీనివాస్‌గౌడ్, నర్సిములు, నూరుపాష, చెన్నప్ప పాల్గొన్నారు.

### నాగుపాముతో ఆటలు



మరికల్: ఇంట్లో దూరిన నాగుపామును పట్టుకొని దానిని మెడలో వేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రాకొండ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పెద్ద ఆంజనేయులు ఇంట్లోకి నాగుపాము దూరింది. కుటుంబ సభ్యులు తీలేర్‌లో పాములు పట్టుకునే ఎరుకలి బీమన్నకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న బీమన్న నాగుపామును పట్టుకొని మెడలో వేసుకొని బయటకు వచ్చాడు. దీంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అతడు ఆ పామును అడవిలో వదిలేశాడు.

### నిధులు మంజూరు చేయండి



ధన్వాడ: మండల కేంద్రంలోని పద్మశాలి కమ్యూనిటీ భవనానికి మరమ్మతు చేయడానికి నిధులు మంజూరు చేయాలని పద్మాశాలి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఎంపీ డీకే అరుణను కలిసి వినతిపత్రం అలాగే ఎస్టిమేషన్ కాపీ అందజేశారు. దీనికి ఎంపీ డీకే అరుణ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపినట్లు పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉదయభాను తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల ఉపాధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు బోగం బాలప్ప తదితరులు ఉన్నారు.

# విద్యుత్ తీగలను సరి చేయండి

నారాయణపేట టౌన్: నారాయణపేట నుంచి దామరగిద్దకు వెళ్లే ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ ఎదురుగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ప్రతి రోజు ఆ మార్గం గుండా ఎన్నో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడే కొండారెడ్డి పల్లి చెరువు ఉండడంతో ప్రతి రోజు పశువుల (మేకలు, గొర్రెలు, ఆవులు)ను పశువుల కాపరులు తీసుకొని వెళ్తొంటారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు ప్రక్కనే ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వర్షాకాలం కూడా కావడంతో ఎర్తింగ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. కావునా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ తీగలకు అల్లుకున్న నూలి తీగలు

### రోడ్డుకు మరమ్మతు



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలోని ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో అధికారులు మట్టి వేసి గుంతలను పూడ్చి వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడడంతో గ్రామంలోని యువకులు గ్రామపంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి గ్రామ స్పెషల్ ఆఫీసర్‌తో మాట్లాడి జేసీపీ ద్వారా గుంతలను పూడ్చి వేసి రోడ్డును చదును చేయించారు.

### ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 5న సెలవు దినం కావడంతో ముందుగానే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉత్తమ బోధన చేసిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు హనుమంత్, ప్రధాన ఉపాధ్యాయురాలు గౌరమ్మ, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, పాలప్ప, గోపాల్, వెంకటరాములు, తిరుమలేష్, సురేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### బస్సు సర్వీసు పునఃప్రారంభం



మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామం నుంచి మందిపల్లి గ్రామానికి బస్సు సర్వీసును అధికారులు బుధవారం నుంచి పున:ప్రారంభించారు. వడ్వాట్ నుంచి మందిపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారడంతో ఇటీవల ఆ గ్రామాల మధ్య తిరిగే బస్సును అధికారులు నిలిపేశారు. దీంతో 20 రోజులుగా విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి బీటీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించి బస్సు సర్వీసును నడపాలని ఆదేశించారు. దీంతో ఆర్టీసీ అధికారులు బుధవారం నుంచి ఈ మార్గంలో బస్సు సర్వీసును పున: ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రహదారులే.. కల్లాలు

ఉమ్మడి మండల పరిధిలోని రోడ్లు పంట నూర్పిళ్లకు కల్లాలుగా మారాయి. మద్దూరు నుంచి కొత్తపల్లి వరకు రోడ్లపై రైతులు ఆముదం పంట నూర్పిళ్లు వేస్తున్నారు. రోడ్లపై పంటను ఆరబెట్టి టార్పాలిన్ కవర్లను కప్పి ఉంచడంతో రోడ్డుకు గుర్తించడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్ నల్లగా ఉండడంతో వేగంగా వచ్చే క్రమంలో రోడ్డు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. - కొత్తపల్లి



# ఇటు పూజలు.. అటు నిమజ్జనం



గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న కంభం శివకుమార్ రెడ్డి, నాయకులు



కొండారెడ్డిపల్లి చెరువులో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని వివిద కాలనీల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సాంస్కృతిక పోటీలు నిర్వహించి అన్నదానం చేశారు. రాజకీయ నాయకుల సందర్శనతో మండపాలు భక్తులు, కార్యకర్తలతో కిటకిటలాడాయి. మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యాయాదవ్, భీష్మారాజ్ ఫౌండేషన్ చైర్మెన్ రాజ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా గణనాథులను దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని బైరంకొండ, శేర్నపల్లి గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని వినాయక మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రాంరహీమ్ ఫ్రెండ్స్, బాలాంజనేయస్వామి దేవాయలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిష్ఠించిన గణేశుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, ఈశ్వర్‌యాదవ్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు వినోద్, పూజారి బాలు, కిష్టప్ప, అశోక్, సాంబ, బస్వరాజ్ పాల్గొన్నారు.

**డీఎస్పీ ప్రత్యేక పూజలు**

నారాయణపేట క్రైమ్: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ లింగయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని లైన్‌వాడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణనాథుడిని బుధవారం ఆయన దర్శించుకున్నారు. మండపాల వద్దకు పోలీసులు పాయింట్ బుక్స్ తనిఖీకి వచ్చినప్పుడు సహకరించాలని, అలాగే మండపాల వద్ద దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత సౌండ్ బాక్స్‌లను బంద్ చేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



పూజల్లో డీఎస్పీ లింగయ్య

**గణనాథుడికి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే**

మక్తల్: పట్టణంలోని యాదవనగర్‌లోని భీరలింగేశ్వర దేవాలయంలో ప్రతిష్ఠించిన ఏకదంతుడిని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన

# సులభంగా బోధించేందుకే ‘టీఎల్ఎం’ మేళా

మక్తల్: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభతర పద్ధతిలో పాఠాలు బోధించేందుకు టీఎల్ఎం మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. బుధవారం మక్తల్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో బోధన ఉపకరణాల మండల స్థాయి మేళా నిర్వహించారు. ఈమేళాను మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అన్ని సబ్జెక్టుల్లో తయారు చేసిన ప్రాజెక్టులలో ప్రథమ, ద్వితీ, తృతీయ స్థానాల్లో నిలిచిన వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ అనిల్‌గౌడ్, జీహెచ్ఎంలు వెంకటయ్యగౌడ వెంకట్‌రాముఉల, రవీందర్, వేణుగోపాల్, గోపాల్ రెడ్డి, హైమవతి, రాము, నాజీయాబేగం, శ్రీనివాసులు, వెంకట్‌రాములు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మేళాను పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి, సభ్యులు

# క్రికెట్ చాంపియన్‌గా వైదిక ఎయిడెడ్ పాఠశాల

నారాయణపేట టౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట అథ్లెటిక్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాఠశాలలు అలాగే కళాశాల విద్యార్థులకు వారం నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. పోటీలలో భాగంగా బుధవారం పాఠశాల, కళాశాల స్థాయిలో ఫైనల్ మ్యాచ్ స్థానిక ఐటీఐ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించారు. పాఠశాల స్థాయిలో వైదిక ఎయిడెడ్ పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాల మధ్య జరిగిన ఫైనల్‌లో వైదిక ఉన్నత పాఠశాల గెలిచి ఛాంపియన్‌గా నిలించింది. అదే విధంగా కళాశాల స్థాయిలో శ్రీ సాయి జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా ఐటీఐ కళాశాల ఛాంపియన్‌గా నిలిచింది. విజేతలకు డీఐఈఓ సుదర్శన రావు అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ తాయప్ప, శ్రీ సాయి కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, పీఈటీ రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో వైదిక ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నర్వ: ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం యాంకి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. లబ్ధిదారులు అధికారులు సూచించిన మేరకు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకుంటే ప్రభుత్వం రూ.5లక్షలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ వినయ్, పంచాయతీ కార్యదర్శి సురాధ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సద్దల ఆంజనేయరెడ్డి, శ్రీనివాసులు, రాజు, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ**

మాగనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో కలిసి మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో నిర్మాణ పనులకు ఎంపీడీవో శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరసింహ, మొగులప్ప, రవి, కృష్ణయ్య, తాయప్ప, ఈరణశెట్టి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న అధికారులు, నాయకులు

# క్షుద్రపూజలకు ఎవరూ బయపడొద్దు

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత గ్రామ శివారులోని వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన ఘటనపై సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి విజ్ఞానదర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీ స్పందించారు. ఘటనాస్థలాన్ని బుధవారం పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ కొంతమంది దొంగ బాబాలు తమ జేబులు నింపుకోవడానికి ఇలాంటి పూజలు నిర్వహించి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అనంతరం ప్రజలకు భయం తొలగించడానికి క్షుద్ర పూజలు చేసిన నిమ్మకాయలతో రసం పిండుకొని జ్యూస్ చేసుకొని తాగారు. మూఢ నమ్మకాలను నమ్మి, దొంగ బాబాల మాటలు విని మోసపోవద్దని ప్రజలకు సూచించారు.



నిమ్మకాయలతో జ్యూస్ చేసుకొని తాగుతున్న మహ్మద్ అలీ